సాక్షి
పెద్దపల్లి
బుధవారం, 1, మే, 2024



మంథని: గోదావరి, మానేరు పరీవాహ ప్రాంతాల్లో నెలరోజులుగా జెట్ విమానం అతితక్కువ ఎత్తులో చెక్కర్లు కొడుతుండడంతో జిల్లావాసులు ఆసక్తితో తిలకిస్తూ ఆందోళన చెందుతున్నారు. - IIలో▸

భానుడి ఉగ్రరూపం

- మంత్రపురిలో అత్యధిక ఉష్ణోగ్రతలు
- గరిష్టంగా 45.3 డిగ్రీల సెల్సియస్ నమోదు
- ఇళ్లకే పరిమితమైన జిల్లావాసులు

జ్యోతినగర్(రామగుండం): భానుడు మంగళవారం ఉగ్రరూపం చూపించాడు. ఉదయం 9గంటల నుంచే నిప్పులు కక్కాడు. ఫలితంగా మంత్రపురి(మంథని)లో గరిష్టంగా 45.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్టంగా 36.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లావాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 42.0 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో నిప్పుల కుంపటిగా మారింది.



మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్‌లో..)

మండలం	ప్రాంతం	కనిష్టం	గరిష్టం
మంథని	మంథని	36.6	45.3
పాలకుర్తి	ఈసాలతక్కళ్లపల్లి	37.1	44.8
ముత్తారం	ముత్తారం	35.0	44.8
ధర్మారం	ధర్మారం	36.2	44.5
రామగుండం	మల్యాలపల్లి	35.8	44.2
పెద్దపల్లి	భోజన్నపేట	35.0	43.9
రామగిరి	కల్వచర్ల	34.9	43.8
సుల్తానాబాద్	సుగ్లాంపల్లి	36.2	43.7
కాల్వశ్రీరాంపూర్	కూనారం	34.9	43.7
అంతర్గాం	ఆకెనపల్లి	36.5	43.7
కాల్వశ్రీరాంపూర్	కాల్వశ్రీరాంపూర్	35.8	43.6
జూలపల్లి	జూలపల్లి	36.4	43.6
రామగుండం	రామగుండం	37.5	43.4
కమాన్‌పూర్	కమాన్‌పూర్	34.9	43.2

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ పూర్తిచేయండి



ముద్రణ తీరు పరిశీలిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ముద్రిస్తున్న ప్రింటింగ్ ప్రెస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఎన్నికల సిబ్బంది, హోం ఓటింగ్ వినియోగించుకుంటున్న ఓటర్లు, ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటుహక్కు వినియోగించుకోనున్న అత్యవసర సేవల సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్లు ముద్రిస్తున్నట్లు ఆయన తెలిపారు. వాటిని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సహాయ రిటర్నింగ్ అధికారులకు అందజేస్తామని కలెక్టర్ అన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

గోదావరిఖని: పౌరుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను నెలపాటు పొడిగిస్తున్నామని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాఫిర్యాదులు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీధులు, రోడ్లపైన అసభ్య పదజాలం వినియోగించడం, అన్నివర్గాలకు ఇబ్బందులు కలిగించడంతో మందుబాబులను కట్టడి చేస్తున్నామన్నారు. ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదేసమయంలో డీజే సౌండ్ వినియోగంపైనా నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారులు, వృద్ధులు, పేషెంట్లతోపాటు విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా, శబ్ద కాలుష్యం నుంచి ప్రజలను కాపాడేందుకు డీజేలపై నిషేధాజ్ఞలు మరో నెలపాటు కొనసాగుతాయన్నారు. కొందరు జనసమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ వినియోగిస్తున్నారని, వీటికి అనుమతి పొందాలని ఆయన సూచించారు.

ఆనందంగా ఉండాలి



సన్మానిస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): ఉద్యోగ విరమణ తర్వాత శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఎన్టీపీసీ ఉద్యోగులు బండారు వెంకటేశ్వరరావు, అబ్దుల్ అజీమ్, ప్రసాద్‌కు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. జనరల్ మేనేజర్లు, ఏజీఎం(హెచ్‌ఆర్), బిజయ్‌కుమార్ సిగ్దర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్ల సత్తా

- టెన్త్‌లోనూ బాలికలదే పైచేయి
- రాష్ట్రంలో 8వ స్థానం
- గతేడాదికన్నా కొద్దిగా మెరుగైన ఫలితాల నమోదు
- 49 పాఠశాలల్లో 10శాతం జీపీఏ



వందశాతం ఉత్తీర్ణత సాధించిన మారెడుగొండ స్కూల్

పెద్దపల్లిరూరల్: జిల్లా విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 49 ప్రభుత్వ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. అందులో 41 జెడ్పీ హైస్కూళ్లు, 3 మోడల్ పాఠశాలలు, 5 కేజీబీవీలు ఉన్నాయి. గతేడాది టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా తొమ్మిదోస్థానంలో నిలువగా ఈసారి ఒక స్థానం మెరుగుపర్చుకుంది.

96.32శాతం ఉత్తీర్ణత

- మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీవరకు నిర్వహించిన టెన్త్ వార్షిక పరీక్షలకు 7,716 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- ఇందులో 7,432 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ఉత్తీర్ణత 96.32 శాతంగా నమోదైంది.
- ఉత్తీర్ణత సాధించడంలో బాలురకన్నా బాలికలదే పైచేయిగా నిలిచింది.
- 3842 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 3,744 మంది బాలికలు(97.45శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- బాలుర విషయానికొస్తే 3,874 మంది పరీక్షలు రాయగా 3,688మంది బాలురు(95.20శాతం) ఉత్తీర్ణులయ్యారు.

మైనార్టీ రెసిడెన్షియల్స్‌లో 99శాతం

జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 99శాతం ఉత్తీర్ణత నమోదైందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మెహరాజ్ మహమ్మద్ తెలిపారు. పెద్దపల్లి, మంథనిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించగా, రామగుండం పాఠశాలలో ఒకరు ఫెయిల్ అయ్యారని, 98శాతంగా ఫలితం వచ్చిందని పేర్కొన్నారు.

10జీపీఏ సాధించింది ఆరుగురు..

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఆరుగురు 10జీపీఏ గ్రేడ్ సాధించి ఆదర్శంగా నిలిచారు.



అద్వైత రేఖ శృతి

- పెద్దపల్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అద్వైత 10 జీపీఏ సాధించింది.
- అలాగే జూలపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు, అంతర్గాం మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు, రామగిరి కేజీబీవీకి చెందిన ఒకరు 10జీపీఏ సాధించారు.

నూరుశాతం ఫలితాలు..

జిల్లాలో కమాన్‌పూర్ మండలం (98శాతం) మినహా అన్ని మండలాల్లో నూరుశాతం ఫలితాలు నమోదయ్యాయి. పెద్దపల్లి మండలం మారెడుగొండ, కొత్తపల్లి, రాగినేడు, తుర్కలమద్దికుంట, బ్రాహ్మణపల్లితోపాటు పెద్దపల్లి బాలికోన్నత పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. పెద్దపల్లిలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పెండ్యా ల అద్వైత 10జీపీఏ సాధించింది. మరో 29 మంది విద్యార్థులు 9.0 జీపీఏకు మించి గ్రేడ్ సాధించారు. అలాగే కాల్వశ్రీరాంపూర్ మండలంలో 6 పాఠశాలలు, ధర్మారం, సుల్తానాబాద్, జూలపల్లి, పాలకుర్తి మండలాల్లో నాలుగు చొప్పున, ఓదెలలో 3, ఎలిగేడు, అంతర్గాంలో రెండేసి చొప్పున, రామగుండం, మంథని మండలాల్లో ఒక్కో పాఠశాల 100శాతం ఫలితాలు నమోదుచేశాయి. వీటితోపాటు మూడు మోడల్ పాఠశాలలు, ఐదు కేజీబీవీలు నూరుశాతం ఫలితాలు సాధించిన జాబితాలో ఉన్నాయి. కాగా, ప్రభుత్వ పాఠశాలలు టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాయనీ డీఈవో మాధవి 'సాక్షి'కి తెలిపారు. గతేడాది రాష్ట్రంలో 9వ స్థానం సాధించగా, ఈసారి కొంత మెరుగుపడి 8వ స్థానంలో నిలిచిందని ఆమె వివరించారు.

రామగుండం, అంతర్గాంలో..



ఎ.సాహితి



సీహెచ్ చందన

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్ ఆదర్శ విద్యాలయం, ఎల్లంపల్లి కస్తూరిబాగాంధీ బాలిక ల విద్యాలయం వందశాతం ఫలితాలు సాధించాయి. లింగాపూర్ మోడల్ స్కూల్‌లో 99 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. సీహెచ్ చందన, ఎ.సాహితీ 10జీపీఏ సాధించారని ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. అదేవిధంగా రామగుండంలోని ప్రభుత్వ ఉర్దూమీడియంలో 8మంది పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. రేష్మా 8.2 జీపీఏ సాధించింది.

ఎల్లంపల్లి కేజీబీవీలో..

ఎల్లంపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 43 మంది పరీక్ష రాయగా అందరూ పాసైనట్లు ప్రత్యేకాధికారి తౌటం కల్పన తెలిపారు. ఇందులో 11 మంది 9.0 నుంచి 10 జీపీఏ సాధించారని పేర్కొన్నారు.

సింగరేణి స్కూల్‌లో..



హెచ్.శ్రీకీర్తన

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక సింగరేణి పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. మొత్తం 79 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ పాసయ్యారు. హెచ్.శ్రీకీర్తన 10 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచింది. రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బి.సంజన 9.7 జీపీఏ సాధించింది. స్థానిక సంతోష్‌నగర్ కేజీబీవీ, పాలకుర్తి పాఠశాలకు చెందిన బి.అంజలి, స్వరనిధి, భవిత 9.3 జీపీఏ సాధించారు.

ఆదాయపు పన్ను మాఫీ చేస్తాం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపుపన్ను మాఫీ చేస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. జీడీకే-2వ గనిపై మంగళవారం గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియా కార్మికులకు పింఛన్ విధానం అమలు చేసింది వెంకటస్వామి అని, ఆయన మనుమడు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. నాయకులు మహంకాళి స్వామి, రాజేశ్, శంకర్ పాల్గొన్నారు. ఆ తర్వాత సింగరేణి ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. అంతకుముందు ఆర్జీ-1 సీఎస్పీలో పర్యటించారు. 26, 27, 38, 40, 47 డివిజన్లతోపాటు ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే ప్రచారం చేశారు.

రూ.200 కోట్లు ఇవ్వాల్సిందే..

రామగుండం/ఫెర్టిలైజర్‌సిటీ: నియోజకవర్గ అభివృద్ధికి ఎన్టీపీసీ రూ.200 కోట్ల సీఎస్ఆర్ నిధులు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరారు. అంతర్గాం మండలం కుందనపల్లి, 39వ డివిజన్ ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీలో ఎమ్మెల్యే మక్కాన్.. ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం చేశారు. ఎంపీ ఎన్నికల్లో వంశీకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జక్కుల నారాయణ, సంగ ణవేణి శేఖర్, సుంకరి రవి, నాజియా సుల్తానా, షబ్బీర్ అహ్మద్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బొంతల రాజేశ్, ఆసిఫ్ పాషా, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ ఓటమే లక్ష్యంగా ప్రచారం

- బీజేపీని విమర్శిస్తే కేసులు పెడుతున్నారు
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం
- పెద్దపల్లి సదస్సులో ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పెద్దపల్లిరూరల్: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కేంద్రంలోని బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలు, యువతకు ప్రధాని నరేంద్రమోదీ చేసిందేమీ లేదని, పైగా రాజ్యాంగాన్నే మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరామ్ ధ్వజమెత్తారు. పీపుల్స్ వాయిస్ ఆధ్వర్యంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం.. పార్లమెంట్ ఎన్నికలు.. మన కర్తవ్యం' అంశంపై పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన చర్చాకార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మునీర్‌తో కలిసి మాట్లాడారు. దేశ ప్రజలకు మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీని విమర్శించే విపక్ష నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐలతో దాడులు చేయించి, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. వారిని ఎలాగైనా లొంగదీసుకునేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈసారి 400 సీట్లు కావాలంటున్నారని, ఈఎన్నికల్లో గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లుగా సాగిస్తున్న ప్రధాని మోదీ సన్నిహిత మిత్రులకు దేశ సంపద దోచిపెట్టి 120 మందిదాకా కుబేరులను తయారు చేశారని సీనియర్ జర్నలిస్ట్ మునీర్ ఆరోపించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం మోదీ బాటలోనే పయనిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నామని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకు ఫోన్‌ట్యాపింగ్ చేసి ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడేలా బరితెగించారని మండిపడ్డారు. ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాకుందామని ఆయన వివరించారు. ఓయూ జేఏసీ కన్వీనర్ కోట శ్రీనివాస్‌గౌడ్, సీపీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, న్యాయవాది దొంకెన రవి, నాయకులు శ్రీమాన్, మ్యాడగోని శ్రీనివాస్, జీవన్‌రాజు, బాలసాని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషితో లక్ష్య సాధన



మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): సమష్టి కృషితోనే నిర్దేశిత లక్ష్యం సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. కుమ్మరికుంటలోని శ్రీసాయి దుర్గా మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక మహాసభ మంగళవారం నిర్వహించారు. డీఏవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీమహిళ క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏవో జ్యోతి, ఎఫ్‌పీవో సీఈవో రాజయ్య, ఆయిల్‌పామ్ సీఈవో, ఎస్‌బీఐ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉండాలి



రిటైర్డ్ అధికారులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: మూడు దశాబ్దాలపాటు సేవలు అందించిన పోలీసు అధికారులు శేషజీవితంలో సంతోషంగా గడపాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు టి.విక్టర్, ఎస్.సురేందర్, టి.గంగరాజుగౌడ్, ఎస్.లింగన్నను తన కార్యాలయంలో మంగళవారం శాలువాలతో సన్మానించారు. సీపీ మాట్లాడుతూ, రిటైర్డ్ ఎస్సైలకు ప్రభుత్వం నుంచి అన్నిరకాల ఆర్థిక ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, సీసీ ఆర్‌బీ సీఐ స్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐలు రమేశ్‌బాబు, ప్రేమ్‌కుమార్, ఏవో అశోక్ కుమార్, సూపరింటెండెంట్‌లు ఇంద్రసేనారెడ్డి, సంధ్య, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లాకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా కార్యవర్గం



నూతన కార్యవర్గం

సుల్తానాబాద్(పెద్దపల్లి): ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కేశవరెడ్డిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా మాటేటి సంజీవ్ కుమార్(సుల్తానాబాద్), భాస్కర్(పెద్దపల్లి), ఆర్.అశోక్ (ముత్తారం), ప్రధాన కార్యదర్శిగా ఎ.బుచ్చిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ.కుమార్(జూలపల్లి), ప్రచార కార్యదర్శులుగా చదువు వెంకట్‌రెడ్డి, అయ్యాజ్, కోశాధికారిగా ఓదేలుయాదవ్,రాష్ట్ర ప్రతినిధులుగా అల్లంకి శ్రీనివాస్, మల్లోజుల విజయానంద్, శ్రీనివాస్‌రెడ్డి, జె.ఉమామహేశ్వర్‌ను ప్రకటించారు. కొత్త కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో ఉంటుందని వివరించారు.

ఎన్టీపీసీలో 1,499 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ 2024–25 ఏప్రిల్‌లో 1,499 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించింది. 80.10 శాతం పీఎల్ఎఫ్‌తో ఉత్పత్తి పూర్తిచేసినట్లు సమాచారం. 200 మెగావాట్ల మొదటి యూనిట్‌లో 185 మెగావాట్లు, రెండో యూనిట్‌లో 190 మెగావాట్లు, మూడో యూనిట్‌లో 190 మెగావాట్లు, నాలుగో యూనిట్‌లో–480 మెగావాట్లు, ఐదో యూనిట్‌లో 480 మెగావాట్లు, ఆరో యూనిట్‌లో 502 మెగావాట్లు, ఏడో యూనిట్‌లో 489 మెగావాట్లు.. మొత్తంగా 2,600 మెగావాట్లకు 2,516 మెగావాట్ల ఉత్పత్తి అవుతోంది.

ఆసక్తి.. ఆందోళన

- గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల్లో విమానం చెక్కర్లు
- అతితక్కువ ఎత్తులో ప్రయాణం.. ఆందోళనలో జనం
- ఏరియల్ సర్వే కోసమా? శిక్షణ సంస్థ విద్యార్థుల కోసమా?



మంథని పట్టణంపై అతి తక్కువ ఎత్తులో వెళ్తున్న జెట్ విమానం

మంథని: ఎయిర్ బస్సు ఎక్కనివారు.. చూడనివాళ్లు సమాజంలో ఇంకా చాలామంది ఉన్నారు. మధ్య తరగతి, సంపన్నులకే విమానం, హెలికాప్టర్‌లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. పేదలు కనీసం అతిసమీపం నుంచి చూసే అదృష్టంగా కూడా ఉండదు. సాధారణంగా వీఐపీల పర్యటన సందర్భంగా గ్రామాలపై హెలికాప్టర్ వెళ్తేనే ఆసక్తిగా చూస్తుంటారు. ఇది ఆకాశంలోని గాలిమోటారు ప్రయాణం తీరు. ఇలాంటి ఆకాశ శకటాలు ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల పరిధిలోని గోదావరి నది, మానేరు పరీవాహక ప్రాంతాల్లో కొద్దినెలలుగా చక్కర్లు కొట్టడం సర్వత్రా ఆందోళన, ఆసక్తి రేపుతోంది.

మారుమూల గ్రామాల్లో.. తక్కువ ఎత్తులో..

- కొద్దినెలలుగా జెట్ విమానం పట్టణాలు, నగరాలే కాదు.. మారుమూల గ్రామాల్లోనూ తిరుగుతోంది.
- అది కూడా అతితక్కువ ఎత్తులో వెళ్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.
- మరోవైపు.. ఇంత తక్కువ ఎత్తులో, ఇటువైపు ఎందుకు వెళ్తుంతోననే ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు.
- మంగళవారం ఉదయం ఒక్కసారిగా భారీ శబ్దంతో అతీసమీపం నుంచి గోదావరిఖని నగరం, మంథని పట్టణాలపై అటు, ఇటుగా విమానం చక్కర్లు కొట్టింది.
- మారుమూల పల్లెల్లోనూ గాలివేగంతో దూసుకెళ్లింది.
- పార్లమెంట్ ఎన్నికల వేళ కావడంతో ఎవరో వీఐపీ వస్తున్నారి తొలుత ప్రజలు భావించారు.
- కానీ, కొన్ని నెలలుగా ఇదేతీరున విమానం చక్కర్లు కొడుతుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- అంతేకాదు.. ఏదైనా సర్వే కోసం వెళ్తుందా, లేక ఇంకా ఏదైనా పనికోసం తిరుగుతందా? అనేది తెలియక అటు ప్రజలు, ఇటు స్థానిక అధికారులు హైరానా పడుతున్నారు.

అటవీ మార్గంలోనూ..

పార్లమెంట్ ఎన్నికల వేళ జెట్ విమానం మానేరు, గోదావరి నదీతీరంతో పాటు అటవీమార్గాల పైనుంచి కూడా చక్కర్లు కొడుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు, మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలు కావడంతో నక్సల్స్ ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ఏరియల్ సర్వే చేస్తున్నారా? లేదా ఏదైనా శిక్షణ కోసం తిరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులదే విమానమని కొందరు వాదిస్తున్నారు. ఇలా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుకుంటున్నారు. కానీ, విమానం ఇలా ఎందుకు తిరుగుతోందనే విషయాన్ని పోలీసులు కూడా వెల్లడించడంలేదు. సంబంధిత శాఖ అధికారులూ ఇప్పటివరకు ప్రకటన చేయలేదు.

ప్రజల్లో ఆసక్తి..

- గ్రామాలు, పట్టణాలు, నగరాలపై నుంచి అతి తక్కువ ఎత్తులో విమానం తిరగడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.
- కేవలం ఉదయం వేళల్లోనే అది వెళ్తుండడంతో చాలామంది ఇళ్లనుంచి బయటకు పరుగున వచ్చి తిలకిస్తున్నారు.
- అయితే, సెల్‌టవర్లు, చెట్లను తాకుతూ వెళ్తున్నట్లు కనిపించడంతో ఆందోళన వ్యక్తవుతోంది.
- అనేకచోట్ల శిక్షణ విమానాలు ప్రమాదాలకు గురైన సంఘటనలను గుర్తుచేసుకుంటూ ప్రజలు భయపడుతున్నారు.

ప్రాణం తీసిన కోడిగుడ్డు వివాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

- భోజన సమయంలో ఘర్షణ.. వృద్ధుడి హత్య

వేములవాడరూరల్: కోడిగుడ్డు విషయమై జరిగిన ఘర్షణ ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాలిటీ పరిధి హన్మక్కపల్లిలోని ఓ తోటలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలు.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన మర్రిపల్లి రాజయ్య (64), వేములవాడ అర్బన్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆనంద్ కొద్దిరోజులుగా హన్మక్కపల్లిలోని ఓ తోటలో పని చేస్తున్నారు. సోమవారం రాత్రి భోజనం చేసే సమయంలో తనకు కోడిగుడ్డు వేయాలని రాజయ్యను ఆనంద్ కోరగా వేయకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం మొదలై ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో రాజయ్యపై ఆనంద్ రాడ్‌తో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం తోటి కార్మికులు తోట యజమాని మల్లేశంయాదవ్, పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్ఐ అంజయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ చాంపియన్ కరీంనగర్



కరీంనగర్‌స్పోర్ట్స్: ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో కరీంనగర్ జిల్లాజట్టు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు టే బుల్ టెన్నిస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌కుమార్, సురేందర్‌సింగ్ తెలిపారు. క్యాడెట్ విభాగంలో చైత్ర, అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్య పతకాలు సాధించారు. ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్, అవనిరెడ్డి, అజయ్, పురుషుల డబుల్స్‌లో అజయ్, చిన్మయి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. సంఘం ఉపాధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, మహేశ్, మహిపా ల్, జాయింట్ సెక్రటరీ వికాస్‌కుమార్, కోశాధికారి గౌతంరెడ్డి అభినందించారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



కాత్యాయని (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ ఆచార్య జయశంకర్ నగర్‌కు చెందిన డిగ్రీ సెకండియర్ విద్యార్థిని ఆడెపు కాత్యాయని(19) ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సింగరేణి ఓసీపీ–2 కార్మికుడు సురేశ్‌కు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కుమార్తె కాత్యాయని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. పరీక్షల కోసం ఇంట్లోనే సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆమె మానసిక ఒత్తిడికి లోనవడంతో తల్లిదండ్రులు టెన్షన్ పడొద్దని, పాసవుతావని నచ్చజెప్పారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతిరాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): లోకపేట గ్రామానికి చెందిన ముతుకుల వెంకటేశ్వర్లు(42) ఆర్థిక ఇబ్బందులు తాళలేక, అనారోగ్యంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వెంకటేశ్వర్లు రెండేళ్లుగా బీపీ, షుగర్, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. తనకున్న 1.5ఎకరాల్లో వ్యవసాయం చేయలేక, ఆర్థిక ఇబ్బందులు పడుతూ జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో ఏప్రిల్ 17న గడ్డిమందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత రంగారెడ్డి జట్టు

గోదావరిఖని: రాష్ట్రస్థాయి 10వ ఇంటర్ డిస్ట్రిక్ట్ మెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా రంగారెడ్డి జట్టు నిలిచింది. నాలుగు రోజులుగా స్థానిక జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో జరిగిన పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఫైనల్ పోటీల్లో ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు తలపడ్డాయి. 3–0 గోల్స్ తేడాతో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలిచింది. మూడోస్థానాన్ని కరీంనగర్ జట్టు కైవసం చేసుకుంది. పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డబ్ల్యూ. గణపతి, ఉపాధ్యక్షుడు ఆర్‌పి నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభా ప్రాంతాల పరిశీలన

గోదావరిఖని: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా రామగుండం పర్యటన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సభాప్రాంతాలను పరిశీలించారు. స్థానిక సింగరేణి స్టేడియం, ఎన్టీపీసీ స్టేడియం పరిశీలించారు. చివరకు సింగరేణి స్టేడియం పర్యటన ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. ఈనెల 6న జరిగే బహిరంగసభకు రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి జేపీనడ్డా రానున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సభాప్రాంతాన్ని పరిశీలించిన వారిలో పార్లమెంట్ ప్రభారి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, కో ఇన్‌చార్జి సుహాసినిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

'ఖని'లో బీజేపీ అభ్యర్థి ప్రచారం

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్, మేదరిబస్తీ, మార్వాడి భవన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఉన్నారు.

అంతర్గాంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో కోరుకంటి చందర్



మాట్లాడుతున్న పుట్ట మధు

రామగుండం: అంతర్గాం మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కారుగుర్తుకు ఓటు వేసి ఈశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయండి

గోదావరిఖని: ఈనెల 3న గోదావరిఖనిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న సాయంత్రం 5గంటలకు స్థానిక మున్సిపల్ ఆఫీస్ తీన్‌రాస్తా నుంచి చౌరస్తావరకు ర్యాలీ ఉంటుందని, చౌరస్తాలో ఏర్పాటు చేసే బహిరంగలో కేసీఆర్ ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

జెడ్పీ చైర్మన్ ప్రచారం..

రామగిరి(మంథని): జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఓసీపీ– 2, బుధవారంపేటలో ప్రచారం నిర్వహించారు. సింగరేణి కార్మికుడిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌కు కార్మికుల కష్టాలు తెలుసునని, ఆయనను ఎంపీగా గెలిపించాలన్నారు. నాయకులు శంకేసి రవీందర్, నయేల్లి సాంబయ్య, విసంపల్లి రమేశ్, ఏగోలపు మల్లయ్య పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'ట్రినిటి' ప్రభంజనం



10జీపీఏ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: ట్రినిటి పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రభంజనం సృష్టించారు. నూరుశాతం ఫలితాలు సాధించడంతోపాటు 29 మంది 10జీపీఏ సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. మరో 180 మంది 9.0 జీపీఏ కన్నా అధిక మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ రమేశ్, వైస్‌ప్రిన్సిపాల్ కుమారస్వామి ఉన్నారు.

గాయత్రీ విద్యార్థుల హవా...

పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. గడ్డం అభిరాం 9.8 జీపీఏ, సాక్షిత 9.7, వర్షిని 9.0 జీపీఏ సాధించారు. మంచిమార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, లింగేశ్వర్ తదితరులు అభినందించారు.

ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానిస్తాం



కూలీలతో మాట్లాడుతున్న వివేక్, లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): కాంగ్రెస్ హయాంలోనే ఉపాధిహామీ అమలు చేసిందని, మరోసారి అధికారం ఇస్తే ఆ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. ఈజీఎస్ కూలీలు పనిచేసే స్థలాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా వారు మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో నాయకులు రూప్లానాయక్, కొత్త నర్సింహులు, పాలకుర్తి రాజేశంగౌడ్, కాడే సూర్యనారాయణ, దేవి జనార్దన్, కాంపెల్లి రాజేశం, కంసాని ఎల్లయ్య, ఓడ్నాల శంకరయ్య, కుంటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమికి సీపీఎం మద్దతు

గోదావరిఖని: లోక్‌సభఎన్నికల్లో ఇండియా కూటమికి సీపీఎం మద్దతు ప్రకటిస్తున్నట్లు నాయకులు తుమ్మల రాజారెడ్డి, వై.యాకయ్య తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా తమ పార్టీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి, కార్మిక చట్టాలను కనుమరుగు చేయాలని చూస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందన్నారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని గెలిపించాలని కోరారు. సీపీఎం నాయకులు భిక్షపతి, కుమారస్వామి, మహేశ్వరి, రామాచారి పాల్గొన్నారు.

ఆస్తికోసం నానమ్మపై హత్యాయత్నం

రామగుండం: ఆస్తికోసం నానమ్మపై హత్యాయత్నం చేసిన ఘటన సోమవారం రాత్రి అంతర్గాం మండలం మద్దిర్యాల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్ కథనం ప్రకారం.. మద్దిర్యాల గ్రామానికి చెందిన మాటూరి బాణయ్య–చిలుకమ్మ దంపతులు. వీరికి ఒక కుమారుడు రాజమల్లు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సింగరేణిలో కార్మికుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన బాణయ్య ఏడేళ్ల క్రితమే మృతిచెందాడు. చిలుకమ్మ ఒకతే ఉంటోంది. ఆమె కుమారుడు మాటూరి రాజమల్లు–భాగ్యలక్ష్మి దంపతులు, వారి పిల్లలు కలిసి కూలీ పనులు చేసుకుంటూ గోదావరిఖనిలోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో రాజమల్లు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా అతడి భార్య భాగ్యలక్ష్మి భర్తను మద్దిర్యాలలోని తన అత్తింట్లో విడిచి వెళ్లింది. దీంతో వృద్ధురాలు తన కుమారుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తూ ఆలనాపాలనా చూస్తోంది. ఈ నేపథ్యంలో రాజమల్లు కుమారుడు అంజి.. డబ్బులు కావాలని నానమ్మ చిలుకమ్మను కొంత కాలంగా వేధిస్తున్నాడు. అయితే, ఆమెను చంపితే ఆస్తి మొత్తం తనకే చెందుతుందని కుట్ర పన్నాడు. సోమవారం రాత్రి నానమ్మ చిలుకమ్మపై కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడిఉన్న వృద్ధురాలు రోదిస్తుండగా ఇరుగు పొరుగువారు బయటకు వచ్చారు. వారిని చూసి అంజి పరారయ్యాడు. వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంథనిలో దొంగనోటు కలకలం



బ్యాంకరు గుర్తించిన నకిలీనోటు

మంథని: పట్టణంలోని ఓ బ్యాంకులో రూ.500 నకిలీ నోటు కలకలం లేపింది. స్థానిక యువకుడు మంగళవారం బ్యాంకులో కొంతమొత్తం డ్రా చేసుకొని అదే మొత్తాన్ని మరోబ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. అక్కడి బ్యాంకు ఉద్యోగి అందులో రూ.500 నోటు నకిలీదాగా గుర్తించాడు. ఈ విషయంపై తొలుత తీసుకున్న బ్యాంకు వద్దకు వెళ్లి బాధితులు నిలదీయగా సదరు వ్యక్తులను సిబ్బంది దబాయించా డు. ఆ తర్వాత సదరు వ్యక్తులు గట్టిగా మాట్లాడటంతో దొంగనోటును తీసుకొని అసలు నోటు ఇచ్చినట్లు సమాచారం.